# గిరిజనం.. ప్రగతి పథం

'సంస్థాన్'లో మారిన తండాల రూపురేఖలు



నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన కడపగండి తండా

- స్వరాష్ట్రంలో చేరువైన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- 15 పంచాయతీల ఏర్పాటుతో స్వయం పాలన
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో కొత్త కళ
- ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు
- బంజారాభవన్, గిరిజన బాలుర గురుకుల పాఠశాల మంజూరు
- సీఎం కేసీఆర్ సారథ్యంలో పెద్దఎత్తున నిధులు విడుదల
- సమగ్రాభివృద్ధి సాధిస్తున్న తండాలు

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 8 : గతంలో సరైన రోడ్లు, సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుక్కెడు నీళ్ల కోసం చెలిమెలు, వాగుల వెంట తిరిగేది. కరెంటు లేకపోవడంతో కట్టెల పొయ్యి వెలుగులో ప్రసవాలు జరిగేవి. తండాలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే మంచం మీద ఎత్తుకొని వాగులు, వంకలు, గుట్టలు దాటుకుంటూ మండల కేంద్రానికి తీసుకొచ్చేవారు. స్వరాష్ట్రంలో ఆ పరిస్థితులు మారాయి. సీఎం కేసీఆర్ గిరిజన తండాలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలో 15 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి తండాకు మిషన్ భగీరథ నీళ్లు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, హెల్త్ సెంటర్లు, గిరిజన గురుకుల పాఠశాల, గిరిజన భవనం, ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయడంతో గిరిజన తండాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి.



గతంలో ఐదు దోనాల తండా గిరిజన ప్రజలకు ఈ చెలిమె నీళ్లే దిక్కు

### నాడు చెలిమె నీళ్లే దిక్కు.. నేడు ఇంటికే శుద్ధి జలాలు

గతంలో తండా ప్రజలు గుక్కెడు నీళ్ల కోసం చంటి పిల్లలను ఎత్తుకొని వాగులు, వంకలు దాటుకుంటూ చెలిమెలు, కుంటల వద్దకు వెళ్లేది. తాగు నీరు ఇప్పించాలని తండా ప్రజలు మండల కేంద్రానికి వచ్చి ధర్నాలు చేసేది. నీళ్ల కోసం ఎన్ని పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకంతో గిరిజన తండాల్లో నీళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ప్రతి తండాలో మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించి ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. తండాలో ప్రతి రోజు శుద్ధి జలాలు అందిస్తున్నారు. 50 కుటుంబాలు ఉన్న రాచకొండ ప్రాంతంలో గుట్టలపై చిట్ట చివరన ఉండే ఐదు దోనాలతండాలో రూ.2 కోట్లు ఖర్చు పెట్టి మిషన్ భగీరథ నీళ్లు అందించడం విశేషం. తండాలకు భగీరథ నీళ్లు రావడంతో నీళ్ల గోస తీరిందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### గిరిజన గురుకుల పాఠశాల మంజూరు

మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా మండల కేంద్రంలో గిరిజన గరుకుల పాఠశాల మంజూరు చేస్తామని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆ మేరకు నారాయణపురం మండల కేంద్రంలో బాలుర గిరిజన గురుకుల పాఠశాలను మంజూరు చేస్తూ సీఎం కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో 5, 6వ తరగతులు నిర్వహిస్తుండగా.. 50మంది వరకు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నది.

### రూ.2 కోట్లతో గిరిజన భవనం

హైదరాబాద్‌లో నిర్మించిన బంజారా భవన్ మాదిరిగా నారాయణపురం మండల కేంద్రంలో గిరిజన భవనం నిర్మాణానికి సీఎం కేసీఆర్ రెండు ఎకరాల స్థలం కేటాయించారు. దాంతోపాటు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. మండల కేంద్రంలో అనువైన స్థలం కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. అదేవిధంగా సొంత నిధులు రూ.10లక్షలతో సంత్ సేవాలాల్ గుడి నిర్మాణం చేస్తానని ఉప ఎన్నిక సమయంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. అందుకు స్థల సేకరణ చేస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

### 10 కొత్త గ్రామపంచాయతీ భవనాలు మంజూరు

మండలంలో 24 గిరిజన తండాలు ఉన్నాయి. అవి గతంలో మేజర్ గ్రామ పంచాయతీలకు అవాస గ్రామాలుగా ఉండేవి. దాంతో ప్రతి చిన్న పని కోసం గ్రామ పంచాయతీలకు వెళ్లాల్సి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో తండాలను గిరిజనులే పాలించుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 15 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 10 గిరిజన గ్రామ పంచాయతీ భవనాలను మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు కేటాయించారు. అదేవిధంగా ప్రతి తండాకు రూ.25 లక్షలు కేటాయించడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టారు.



మండల కేంద్రంలో బాలుర గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనం



చిల్లపురంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు

### గిరిజనులకు అండగా సీఎం కేసీఆర్

గిరిజన తండాల ప్రజలను సీఎం కేసీఆర్ సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు. మండలంలో 16 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతోపాటు 10 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు చేశారు. తండాలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేశాం. మా గిరిజన తండాల ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– దేవిలాల్, వాచ్యతండా సర్పంచ్



### నిధులు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

గిరిజన తండాల అభివృద్ధే ధ్యేయంగా పనులు చేస్తున్నాం. ఎస్టీ గురుకుల పాఠశాల, గిరిజన భవనం, సంత్ సేవాలాల్ గుడి నిర్మాణం, సీసీ రోడ్లతోపాటు ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేశాం. గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడం చాలా తృప్తినిచ్చింది. తండాల అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



- సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకంపై లబ్ధిదారుల హర్షం
- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- నల్లగొండలో దళిత బంధుపై అవగాహన సదస్సు
- 1100 మందికి మంజూరు పత్రాల అందజేత



నల్లగొండలో అవగాహన సదస్సుకు హాజరైన దళితబంధు లబ్ధిదారులు

## దళితుల గౌరవం పెంచేందుకే దళిత బంధు

### పది లక్షల సాయంతో అండగా నిలుస్తున్న ప్రభుత్వం

నల్లగొండ రూరల్, అక్టోబర్ 8 : దళితులను 75 ఏండ్లుగా ఎవరూ పట్టించుకోలేదని.. సమాజంలో అందరితో సమానంగా వారి గౌరవం పెంచేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. దళితుల అభ్యున్నతి కోసమే దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో దళితబంధు రెండో విడుత లబ్ధిదారులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు దళిత బంధు ప్రొసిడింగ్ పత్రాలు అందజేసి యూనిట్ల ఎంపికపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత బంధు మొదటి విడుతలో నల్లగొండ నియోజకవర్గంలో 100 మందికి యూనిట్లు అందజేశామన్నారు. అందులో ఎక్కువగా కోళ్లఫామ్, డెయిరీ ఫామ్‌తోపాటు లాభాలు వచ్చే వాటిని ఎంపిక చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. రెండో విడుతలో ఎంపికైన 1100 మంది లబ్ధిదారులు ఉన్నతాధికారుల సూచన మేరకు ఆర్థిక అభివృద్ధి చెందే వ్యాపారాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రూ.10 లక్షలతో దిన దినాభివృద్ధి చెంది కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వంటి కుట్రదారులు దళితులకు దళిత బంధు ఎందుకు అంటున్నారని, అలాంటి నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. నల్లగొండ పట్టణం విస్తరిస్తున్నదని, హైదరాబాద్ తరహాలో ఎన్నో రకాల బిజినెస్‌లకు అడ్డాగా మారనుందని చెప్పారు. దళిత బంధు లబ్ధిదారులు తెలివిగా ఆలోచించి ఆర్థిక అభివృద్ధి సాధించే వ్యాపారాలు పెట్టుకోవాలని సూచించారు. దళితుల అభ్యున్నతికి కృషి చేసున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ దళిత బంధు పథకం ప్రారంభంలో ఇది సక్సెస్ అవుతుందో.. కాదోనని, లబ్ధిదారులు డబ్బు వృథా చేస్తారనే అపోహలు ఉండేవన్నారు. పైలట్ ప్రాజెక్ట్‌గా హుజూరాబాద్‌ను తీసుకొని రూ.1800 కోట్లు ఇచ్చారని, ఇప్పుడు వారంతా నెలకు లక్ష నుంచి 2లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నారని తెలిపారు. దళిత బంధు ఒక సువర్ణ అవకాశమని, యూనిట్ ఎంపికలో జాగ్రత్తలు తీసుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకంలో ఎంపికైన వారంతా త్వరలో కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం దళితబంధు పొందిన హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండలం భేతిగల్ గ్రామానికి చెందిన జీఎస్ గౌతమ్ కృష్ణ తీసిన ది కాప్ సినిమా ఫస్ట్ లాంచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దళిత బంధు డబ్బుతో సక్సెస్ సాధించిన గౌతమ్ కృష్ణను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఈ సదస్సుకు పిలిపించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ గౌడ్, కనగల్, తిప్పర్తి ఎంపీపీలు కరీంపాషా, విజయలక్ష్మి, కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు నాగరత్నం రాజు, వాసుదేవరెడ్డి, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### దళితబంధుతో రెండు సినిమాలు తీశాను



నాకు చిన్నప్పటి నుంచీ సినిమా తీయాలనే తపన ఉండేది. కానీ ఆర్థిక పరిస్థితులతో సాధ్యం కాలేదు. సీఎం కేసీఆర్ పుణ్యమా అని దళిత బంధు ప్రవేశ పెట్టడంతో సినిమా కెమెరాలకు దరఖాస్తు చేసుకున్నా. అప్పటి కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ దళిత బంధు యూనిట్ మంజూరు చేశారు. ఇప్పుడు రెండు సినిమాలకు దర్శకత్వం వహిస్తున్న. సీఎం కేసీఆర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటా. ఇప్పటి వరకు రెండు సినిమాలకు దర్శకత్వం వహించా. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మరిన్ని సినిమాలు చేస్తా.

– గౌతమ్‌కృష్ణ, దళితబంధు లబ్ధిదారుడు, భేతిగల్, వీణవంక మండలం, హుజూరాబాద్ నియోజకవర్గం

## నందికొండలో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాంతో బుద్ధవనం, లాంచీస్టేషన్, సాగర్ డ్యామ్ పరిసరాల్లో సందడి నెలకొంది. తెలంగాణ టూరిజం శాఖ కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన లాంచీలో జాలి ట్రిప్పు, నాగార్జున కొండకు వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. బుద్ధవనంలో బుద్ధుడి జీవిత గాథలు తెలిపే అష్టాంగ మార్గాలు, మహాస్థూపాన్ని దర్శించుకున్నారు.

– నందికొండ, అక్టోబర్ 8



బోటు దిగి వస్తున్న పర్యాటకులు

# అల్లరి

## మారిన మార్జాలం!

కథ



**ఒక చెట్టుపై** పిచ్చుక గూడుకట్టుకొని, తన పిల్లలతో నివాసం ఉన్నది. అదే చెట్టుతొర్రలో ఒక ఉడుత ఉండేది. అవి రెండూ మంచి నేస్తాలు. ఒకరోజు అక్కడికి ఒక పిల్లి వచ్చింది. పిచ్చుక పిల్లలను తినాలని పథకం పన్నింది. ముందుగా ఉడుతతో తియ్యని మాటలు చెబుతూ, స్నేహం చేస్తానని అన్నది. అప్పుడు ఉడుత.. ''నీ స్నేహం గురించి మొదట పిచ్చుకను అడుగు!'' అని చెప్పింది. పిల్లి వెళ్లి పిచ్చుకను అడిగితే.. అది ఒప్పుకోలేదు. పిల్లి మళ్లీ వెళ్లి ఉడుతను బతిమాలింది. ''నేను పిల్లినైనంత మాత్రాన మీకు అపకారం చేస్తానా? కొన్ని రోజులు నాతో స్నేహం చేస్తే మీకే నా గుణం తెలిసిపోతుంది. ఆ తర్వాత నచ్చకుంటే నేనే వెళ్లిపోతాను'' అని అన్నది. ఆ మాటలకు ఉడుత కరిగిపోయింది. పిచ్చుకను సమదాయించి, పిల్లితో స్నేహానికి ఒప్పించింది. తన పథకం ఫలించినందుకు పిల్లి ఎంతో సంతోషించింది. 'పిచ్చుక పిల్లలను ఎప్పుడు తిందామా!?' అని ఎదురుచూస్తూ ఉన్నది. ఇంతలో అక్కడికి ఒక పాము వచ్చి.. పిచ్చుక పిల్లలను తినడానికి చెట్టు ఎక్కబోయింది. ఆ సమయంలో అక్కడ తల్లి పిచ్చుక, ఉడుత లేవు. ఆహారం కోసం బయటికి వెళ్లాయి. అప్పటిదాకా బయట తిరిగి.. అప్పుడే చెట్టు దగ్గరికి వచ్చింది పిల్లి. పిచ్చుక పిల్లల కోసం చెట్టు పైకి ఎక్కుతున్న పామును చూసింది. తన ఆహారం తినేందుకు ప్రయత్నిస్తున్న పాముపై దానికి విపరీతమైన కోపం వచ్చింది. అందుకే, పాముతో భీకరంగా పోరాడింది. దాంతో పాము భయపడి పారిపోయింది. కానీ, పిల్లి మాత్రం గాయపడ్డది. అవి పోట్లాడుకుంటున్నప్పుడే.. పిచ్చుక, ఉడుత అక్కడికి వచ్చాయి. తన పిల్లల కోసం పిల్లి చేసిన ఉపకారాన్ని కొనియాడింది పిచ్చుక. పిల్లిని తప్పుగా అర్థం చేసుకున్నందుకు క్షమించమని అడిగింది. పిచ్చుక మాటలకు పిల్లి ఎంతో పొంగిపోయింది. దాని మనసు కరిగి.. తన ప్రవర్తనే మారిపోయింది. 'ఇప్పటి నుంచి మిత్రధర్మం పాటిస్తాను. పిచ్చుక పిల్లలకు అపకారం చేయను' అని మనసులోనే గట్టిగా నిర్ణయించుకున్నది. నాటి నుంచి పిచ్చుక, ఉడుత, వాటి పిల్లలకు ఏ ఆపదా రాకుండా కాపాడుతూ వచ్చింది.

**నీతి :** మిత్రులకు ఉపకారం చేస్తే.. ఆ స్నేహం మరింత బలపడుతుంది.


– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

### దారి చూపండి

పైన ఉన్న బుల్లి కుందేలు.. ఆ క్యారెట్లన్నీ తినుకుంటూ, తల్లిని చేరే దారి చూపండి.



### కనుక్కోండి



పైన ఉన్న కుక్క బొమ్మ సరైన నీడ ఏదో కనుక్కోండి.

### చెప్పుకోండి



1. భారత అత్యున్నత పౌర పురస్కారం ఏది?
2. 'ది లీనింగ్ టవర్ ఆఫ్ పీసా' ఏ దేశంలో ఉన్నది?
3. కోడిగుడ్డు తెల్లసొనలో ఉండే ప్రొటీన్ ఏది?

### లిటిల్ హ్యాండ్స్





సీహెచ్. మధుప్రియ
రాయిలాపూర్.

### పదసృష్టి



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Private

Ex : Rat

### టంగ్ ట్విస్టర్స్



Fresh French fried fly fritters.


### పెద్దల మాట

బలంగా పోరాటం చేయకపోయినా, ధైర్యంగా సవాళ్లను స్వీకరించకపోయినా సగం అపజయం పొందినట్టే.

– నేతాజీ సుభాష్ చంద్రబోస్



### ఆ పదమేంటి?




ఇచ్చిన ఆధారాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.

**జవాబులు :** ఆ పదమేంటి? : CHICKEN
చెప్పుకోండి : 1. భారతరత్న 2. ఇటలీ 3. అల్బుమిన్

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా : zindagi@ntnews.com